సాక్షి
యాదాద్రి భువనగిరి

ఆదివారం : 30 : జూలై : 2023



దశాబ్ది ఉత్సవాల్లో గుర్తించ లేదు

దశాబ్ది ఉత్సవాల్లో ప్రభుత్వం ఆర్టీసీని గుర్తించలేదని ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నారు. - 8లో



పుట్టపాకకు ప్రపంచ కీర్తి

పుట్టపాక చేనేత కార్మికులు ప్రజల అభిరుచికి తగినట్లు డిజైన్లు రూపొందిస్తూ కొత్త ఒరవడి సృష్టిస్తున్నారు. - 8లో

గరిష్ఠం/కనిష్ఠం 31°/24°

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

చౌటుప్పల్ మున్సిపల్ కమిషనర్‌గా కృష్ణారెడ్డి



ఎన్.కృష్ణారెడ్డి

చౌటుప్పల్ : చౌటుప్పల్ నూతన మున్సిపల్ కమిషనర్‌గా ఎన్.కృష్ణారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవిందకుమార్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. సంగారెడ్డి జిల్లా సదాశివపేట మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న కృష్ణారెడ్డి బదిలీపై వచ్చారు. ఇక్కడ కమిషనర్‌గా పని చేస్తున్న సోలిపురం భాస్కర్‌రెడ్డి సదాశివపేటకు బదిలీ అయ్యారు. నూతన కమిషనర్ సోమవారం బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది.

నారసింహుడికి లక్ష పుష్పార్చన



పుష్పార్చన చేస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామికి శనివారం లక్ష పుష్పార్చన వేడుకను ఆచార్యులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖమండపంలో ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి తీరొక్క పుష్పాలతో అర్చన చేశారు. అదే విధంగా తులసీ దళాలతో శ్రీస్వామి అమ్మవార్లను పూజించారు. ఇక ప్రధానాలయంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, నిత్య కల్యాణం, గజవాహనసేవ, బ్రహ్మోత్సవం, వెండి జోడు సేవలు తదితర కైంకర్యాలు నిర్వహించారు.

ప్రముఖుల పూజలు

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామిని ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్, ఐఏఎస్‌లు హరిచందన, ప్రఫుల్ దేశాయ్, ఐపీఎస్ సౌమ్య మిశ్రా దర్శించుకున్నారు. గర్భాలయంలో స్వయంభూలకు ప్రత్యేక పూజలు చేశారు.

టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డిని కలిసిన వడ్లోజు

యాదగిరిగుట్ట : తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈఓ ధర్మారెడ్డిని యాదగిరిగుట్టకు చెందిన టీటీడీ లోకల్ అడ్వైజరీ సభ్యుడు వడ్లోజు వెంకటేష్ శనివారం కలిశారు. తిరుమల కొండపైగెస్ట్ హౌజ్ ప్రారంభోత్సవంలో అడ్వయిజరీ సభ్యుడిగా వడ్లోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామివారి లడ్డూ ప్రసాదాన్ని వైవీ సుబ్బారెడ్డి, ఈఓకు అందజేసి స్వామివారి శేష వస్త్రంతో సన్మానించారు. తెలంగాణ తిరుమలగా అభివృద్ధి చెందుతున్న యాదాద్రి క్షేత్రాన్ని సందర్శించాలని వైవీ సుబ్బారెడ్డి, ఈఓ ధర్మారెడ్డిని వడ్లోజు వెంకటేష్ కోరారు.

ఉపాధ్యాయులకు అండగా పీఆర్‌టీయూ టీఎస్



మాట్లాడుతున్న శ్రీపాల్‌రెడ్డి

నల్లగొండ: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్న ఏకైక సంఘం పీఆర్‌టీయూ టీఎస్ అని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పింగలి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. శనివారం నల్లగొండలోని ఆ సంఘం భవన్‌లో జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తు న్న బదిలీలు, పదో న్నతుల షెడ్యూలు విడుదల అయినప్పటికీ కొంతమంది ఉపాధ్యాయులు కోర్టుకు వెళ్లిన కారణంగా వాయిదాలు పడుతూ వస్తుందన్నారు. కోర్టు తీర్పు కోసం వేచి చూస్తామని, తీర్పు అనుకూలంగా వస్తే వెంటనే బదిలీలు, పదోన్నతుల కార్యక్రమం చేపట్టేలా చూస్తామన్నారు. సీపీఎస్ ఉద్యోగులు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న బస్సు యాత్రకు సంఘం పూర్తి మద్దతును ప్రకటించిందని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ మాట్లాడుతూ పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదులో నల్లగొండ జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ఉండేలా మండల బాధ్యులు కృషి చేయాలన్నారు. ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కాళం నారాయణరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా గౌరవాధ్యక్షుడు ఓరుగంటి శ్రీనివాసులు, రాష్ట్ర బాధ్యులు కరుణాకర్‌రెడ్డి, కొల్లు శ్రీనివాస్‌రెడ్డి, కళావతి, నారాయణ కవిత, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల జానారెడ్డి, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు పరమేశ్ యాదవ్, చిలకరాజు శ్రీనివాస్, వివిధ మండలాల బాధ్యులు యూసుఫ్ పాషా,తిరందాసు సత్తయ్య పాల్గొన్నారు.

దారులు ధ్వంసం!

వర్షాలకు రోడ్లన్నీ ఆగమాగం

- కంకర తేలి, మోకాలు లోతులో గుంతలు
- రాకపోకలు సాగించలేని దుస్థితి
- అధికారులు గుర్తించింది 18 మార్గాలే
- హైవేదీ అదే తీరు



భువనగిరి మండల పరిధిలో అనంతారం వద్ద జాతీయ రహదారిపై కొట్టుకుపోయిన తారు

సాక్షి, యాదాద్రి : జిల్లాలో కురిసిన వరుస వర్షాలు తీవ్రనష్టాన్ని మిగిల్చాయి. ప్రధాన రహదారుల నుంచి.. కాలనీల్లో రోడ్ల వరకు అధ్వానంగా తయారయ్యాయి. కంకర తేలి, గుంతలు పడి, కోతకు గురై రాకపోకలు సాగించలేని విధంగా మారాయి. మొత్తం 18 చోట్ల రోడ్లు దెబ్బతిన్నాయని, సుమారు రూ.1.37 కోట్ల నష్టం జరిగినట్లు ఆర్అండ్‌బీ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు.

అధికారులు గుర్తించినవి..

- బొల్లేపల్లి నుంచి సంగెం రహదారి
- బీబీనగర్ - భూదాన్‌పోచంపల్లి మార్గంలో రుద్రవెల్లి వద్ద
- వలిగొండ - చందేపల్లి రూట్‌లో వెల్వర్తి, వలిగొండ
- అనాజిపూర్ - జంపల్లి రహదారిపై అనాజిపూర్
- భూదాన్‌పోచంపల్లి - పెద్దరావులపల్లి రోడ్డుపై ఇంద్రియాల
- బీబీనగర్ - నాగిరెడ్డిపల్లి మార్గంలో బొల్లేపల్లి
- ఆలేరు - బచ్చన్నపేట రోడ్డులో కొలనుపాక
- యాదగిరిగుట్ట - చేర్యాల దారిలో కాల్వపల్లి
- హైదరాబాద్ - హన్మకొండ రోడ్డు
- ఆలేరు - జీడికల్ వయా బహుద్దూర్‌పేట, మంతపురి, ఇక్కుర్తి నుంచి అమ్మనబోలు మీదుగా గొలను కొండవరకున్న మార్గంలో షారాజీపేట, బహుద్దూర్‌పేట, గొలనుకొండ వద్ద..
- గుండాల-సూర్యాపేట రోడ్డులో గుండాల
- రాజాపేట- కొలనుపాక రోడ్డులో దూదివెంకటాపూర్
- జనగాం - సీతారాంపూర్ మార్గంలో మరిపడగ
- చౌదరపల్లి - పల్లెపహాడ్ రూట్‌లో పల్లెపహాడ్
- జీడికల్ - వెల్మజాల రోడ్డులో వెల్మజాల వద్ద
- రామన్నపేట - అమ్మనబోలు మార్గంలో
- అడ్డగూడూరు- లక్ష్మీదేవికాల్వ రూట్‌లో ధర్మారం వద్ద రోడ్డు ధ్వంసమైనట్లు అధికారులు తమ నివేదికలో పేర్కొన్నారు.



వలిగొండ - వెల్వర్తి మార్గంలో మల్లేపల్లి వద్ద మడుగులా మారిన రోడ్డు

లెక్కలోకి రానివి..

వర్షాలకు జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున రహదారులు ధ్వంసమైనా అధికారుల లెక్కల్లోకి రాలేదు.

- మోత్కూర్ మున్సిపాలిటీ పరిధిలో రాజన్నగూడెం, సీక్రెట్ హార్ట్ స్కూల్, బీఎస్ఎన్ఎల్ ఆఫీస్, పనకబండ చౌరస్తా వద్ద భారీ గుంతలు ఏర్పడ్డాయి.
- రాజాపేట మండలంలోని పుట్టగూడెం - మల్లగూడెం రోడ్డు, దూది వెంకటాపురంనుంచి రఘునాథపురం, పొట్టిమర్రినుంచి రఘునాథపురం, చల్లూరు, బేగంపేట రోడ్లు ఛిద్రమయ్యాయి.
- బొమ్మలరామారం మండలం లక్ష్మీతండా, గోవింద్‌తండా, కంచల్‌తండా రోడ్లు రాకపోకలు సాగించలేని విధంగా తయారయ్యాయి.
- వలిగొండ మండలంలోని వెల్వర్తి - ఆరూర్, వలిగొండ - వెల్వర్తి, వలిగొండ - భువనగిరి ప్రధాన రహదారిపై అక్కంపెల్లి, మాందాపురం మార్గాలు పూర్తిగా దెబ్బతిన్నాయి.
- బీబీనగర్ మండలంలో గుర్రాలదండి, జనంపల్లి-గూడూరు, పడమటిసోమారం-పల్లెగూడెం, భూదానర్‌పోచంపల్లి మండలంలోని పిల్లాయపల్లి- దేశ్‌ముఖ్ మధ్యన రహదారులు అస్తవ్యస్తంగా మారాయి.

జాతీయ రహదారి గుంతలమయం

హైదరాబాద్ - వరంగల్ జాతీయ రహదారి జిల్లా పరిధిలో గుంతలమయంగా మారింది. ప్రధానంగా భువనగిరి, బీబీనగర్ వద్ద పెద్ద ఎత్తున గుంతలు ఏర్పడి నీరు నిలువడంతో వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. ఈ ఏడాది రెన్యూవల్ చేసినప్పటికీ స్వల్పకాలానికే రోడ్డు దెబ్బతింది. నాసిరకం పనులే కారణమని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.



వలిగొండ వద్ద మూసీ వంతెనపై రోడ్డు ఇలా..

మూసీ వంతెనపై ప్రమాదకరంగా..

వలిగొండ వద్ద ఉన్న మూసీ వంతెనపై రహదారి వర్షాలకు మరింత ప్రమాదకరంగా మారింది. నిత్యం వందలాది వాహనాలు ఈ వంతెన పైనుంచి రాకపోకలు సాగిస్తుంటాయి. వర్షాలకు పూర్తిగా దెబ్బతింది. అడుగడుగునా గుంతలు ఏర్పడడంతో వాహనదారులు ఇక్కడకు రాగానే ఇబ్బందులు పడుతున్నారు.



బీబీనగర్ మండలంలోని రుద్రవెల్లి - జూలూరు మధ్య..

డీసీసీ పీఠం దక్కేదెవరికో?

- నేడో, రేపో ప్రకటించనున్న టీపీసీసీ
- కోమటిరెడ్డి, రేవంత్ వర్గీయుల ముమ్మర ప్రయత్నాలు
- సామాజిక వర్గం ప్రాతిపదికన ఎంపిక చేసే అవకాశం
- ఆశావహుల్లో ఉత్కంఠ



సాక్షి, యాదాద్రి : జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పీఠం కోసం ఆశావహులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. నేడో, రేపో అధ్యక్షున్ని ప్రకటించే అవకాశం ఉన్నందున పదవిని దక్కించుకునేందుకు ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వర్గీయుల మధ్య పోటాపోటీ కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణిక్ రావ్‌ఠాక్రేను కలిసి తమకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. అయితే ఉమ్మడి జిల్లా సామాజికవర్గ సమీకరణల్లో భాగంగా ఓసీ వర్గానికి అధ్యక్ష పదవి, దళిత వర్గానికి వర్కింగ్ ప్రెసిడెంట్ ఖరారైనట్లు తెలుస్తోంది.

రేసులో ఉన్నది వీరే..

కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి రాజీనామాతో ఖాళీ ఏర్పడిన డీసీసీ అధ్యక్ష పదవి కోసం తీవ్ర పోటీ నెలకొంది. కోమటిరెడ్డి, రేవంత్‌రెడ్డి వర్గీయులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ.. అధిష్టానం మాత్రం వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఆచితూచి అడుగులు వేస్తోంది. భువనగిరి మున్సిపల్ మాజీ చైర్మన్ బర్రె జహంగీర్ పేరును ప్రతిపాదించినట్లు సమాచారం. తమకు అవకాశం కల్పించాలని ఆలేరు నియోజకవర్గానికి చెందిన అండెం సంజీవరెడ్డి, భువనగిరికి చెందిన పోత్నక్ ప్రమోద్‌కుమార్‌తో పాటు మరికొందరు నేతలు కోమటిరెడ్డి వద్ద ప్రయత్నాలు చేస్తున్నారు. అదే విధంగా ఆలేరు నియోజకవర్గానికి చెందిన బోరెడ్డి అయోధ్యరెడ్డి, కల్లూరి రామచంద్రారెడ్డి తోపాటు మరో రాష్ట్ర స్థాయి నాయకురాలు పోటీలో ఉన్నట్లు సమాచారం. ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ కసిరెడ్డి నారాయణరెడ్డి సైతం రేసులోకి వచ్చారు. మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత కుందూరు జానారెడ్డి ద్వారా ప్రయత్నాలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే పీసీసీ అధ్యక్షుడు, ఎంపీ ఇద్దరు కలిసి ఎవరిని నియమిస్తారనేది ఆసక్తికరంగా మారింది.

ఓసీలకు ప్రెసిడెంట్, ఎస్సీలకు వర్కింగ్ ప్రెసిడెంట్

సామాజిక వర్గ సమీకరణల ప్రాతిపదికన డీసీసీ అధ్యక్షున్ని నియమించే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. నల్లగొండకు ఎస్టీ, సూర్యాపేటకు బీసీ సామాజిక వర్గం నుంచి అధ్యక్షులను నియమించారు. యాదాద్రి భువనగిరి జిల్లాకు ఓసీలతో పాటు, బీసీలు, ఎస్సీ, ఎస్టీ వర్గాల నేతలు పోటీ పడుతున్నారు. అయితే ఓసీ వర్గానికి చెందిన నాయకున్ని పదవి వరించే అవకాశాలు ఉన్నట్లు పార్టీలోని ఓ వర్గం చెబుతుండగా.. ఎస్సీ వర్గానికి వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి దక్కే అవకాశాలున్నట్లు చర్చ జరుగుతోంది. బీసీ నాయకులు డీసీసీ రేసులో ఉన్నప్పటికీ జిల్లాలో రెండు ఎమ్మెల్యే స్థానాలు బీసీలకు వచ్చే అవకాశం ఉన్నందున డీసీసీ పదవి రేసులోంచి తప్పుకోవాలని అధిష్టానం కోరినట్లు తెలుస్తోంది.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

- ప్రభుత్వ విప్ గొంగిడి సునీత

ఆలేరురూరల్ : ఆలేరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దడమే ధ్యేయమని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే గొంగిడి సునీతా మహేందర్‌రెడ్డి అన్నారు. ఆలేరు పట్టణంలోని తన క్యాంప్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధికోసం ముఖ్యమంత్రి కేసీఆర్‌తో మాట్లాడి ఇప్పటికే కోట్లాది రూపాయలు తీసుకువచ్చినట్లు గుర్తించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించాలన్న లక్ష్యంతోనే ప్రతి వారం ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలు సులువుగా తన దృష్టికి వస్తున్నట్లు తెలిపారు. మొత్తం 28 వినతులు వచ్చాయని వీటిలో రెవెన్యూ, డబుల్ బెడ్రూం, స్థలాలు, పింఛన్, రోడ్లకు మరమ్మతులు, దళితబంధు, లక్ష రూపాయల ఆర్థిక సాయం తదితర సమస్యలున్నట్లు తెలిపారు. వినతులను త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య, పట్టణ అధ్యక్షుడు పుట్ట మల్లేషం పత్తి వెంకటేష్, బేతిరాములు, కుండ సంపత్, పూల శ్రవణ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న ప్రభుత్వ విప్ సునీత

పోస్టాఫీస్‌లో స్టాంపుల కొరత

- మోత్కూరులో వినియోగదారుల ఇబ్బందులు
- భువనగిరి, ఆలేరు నుంచి తెప్పించుకుంటున్న స్టాంప్ వెండర్లు
- ఆధార్ సెంటరూ నిరుపయోగం

మోత్కూరు : పట్టణంలోని సబ్ పోస్టాఫీస్‌లో వివిధ రకాల స్టాంపులు గత కొంతకాలంగా అందుబాటులో ఉండడం లేదు. రెవెన్యూ, జ్యుడీషియల్ స్టాంపులతో పాటు పోస్టు కార్డులు లభించకపోవడంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. రెవెన్యూ, జ్యుడీషియల్ స్టాంపులను భువనగిరి, ఆలేరు ప్రాంతాల నుంచి తెప్పించుకుంటున్నట్లు స్టాంప్ వెండర్లు చెబుతున్నారు.

అందుబాటులోకి రాని ఆధార్ సేవలు

పోస్టల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్‌లో నెలలు గడుస్తున్నా సేవలు అందుబాటులోకి రావడం లేదు. వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని వాపోతున్నారు. ఆధార్ సేవల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. స్టాంపులను తక్షణమే అందుబాటులో ఉంచడంతో పాటు ఆధార్ కేంద్రంలో సేవలను ప్రారంభించాలని కోరుతున్నారు.

ఎస్పీఎం ఏమంటున్నారంటే..

పైనుంచి తమకు స్టాంపులు రావడం లేదని ఇన్‌చార్జ్ ఎస్పీఎం అశోక్ తెలిపారు. విషయాన్ని ఉన్నతాధికారుల దష్టికి తీసుకెళ్తామన్నారు.

రూ.109 కోట్లు రుణాలిచ్చాం

- పోచంపల్లి బ్యాంకు చైర్మన్ వెంకట బాలసుబ్రహ్మణ్యం

భూదాన్‌పోచంపల్లి : పోచంపల్లి కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు రూ.109.71 కోట్ల రుణాలు మంజూరు చేసి ఆదర్శంగా నిలిచిందని బ్యాంకు చైర్మన్ కర్నాటి వెంకట బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. శనివారం భూదాన్‌పోచంపల్లిలోని బాలాజీ ఫంక్షన్ హాలులో బ్యాంకు 47వ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022-23 ఆర్థిక సంవత్సరం మార్చి31 నాటికి రూ.172.09 కోట్లు డిపాజిట్లు సేకరించామని, బ్యాంకు వాటాధనం రూ.5.94 కోట్లు ఉందని చెప్పారు. వాటాదారులకు 16శాతం డివిడెంట్ చెల్లిస్తున్నామని తెలిపారు. బ్యాంకు స్థాపించిన 18 ఏళ్లలో నెట్ ఎన్‌పీఏ జీరో ఉండటం ఎంతో గర్వకారణమన్నారు. త్వరలో ఎల్‌బీనగర్, హయత్‌నగర్‌లో నూతన శాఖలను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. బ్యాంకు ద్వారా అందజేస్తున్న ఏటీఎం, యూపీఐ, మొబైల్ బ్యాంకింగ్, పీఏజెజెబీవై, పీఎంఎస్‌బీవై, జీజేపీఏ సేవలతో పాటు శ్రీరాం లైట్ ఇన్సురెన్స్‌ను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఖాతాదారుల కోసం మరిన్ని సేవలను అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తామని చెప్పారు. అంతకుముందు బ్యాంకు సీఈఓ సీత శ్రీనివాస్ బ్యాంకు సాధించిన ప్రగతి నివేదికను చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మాడ్గుల ప్రభాకర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మిశ్రీనివాస్, వైస్‌చైర్మన్ బాత్క లింగస్వామి, బ్యాంకు వైస్ చైర్మన్ సూరెపల్లి రమేశ్, డైరెక్టర్లు సీత దామోదర్, భోగ విజయకుమార్, చిక్క కృష్ణ, పున్న లక్ష్మీనారాయణ, ఎల్లస్వామి, కడవేరు కవిత, అర్చన, రాపోలు వేణు, బిట్టు భాస్కర్, ఎస్.కృష్ణకిషోర్, బ్యాంకు మాజీ చైర్మన్లు కర్నాటి పాండు, చిట్టిపోలు శ్రీనివాస్, తెలంగాణ సహకార శాఖ సీనియర్ ఇనిస్పెక్టర్ ఎల్లారెడ్డి, తడక రమేశ్, సిద్దగోని రంగయ్య, కౌన్సిలర్లు కర్నాటి రవీందర్, గుండు మధు, కొండ శంకరయ్య, కుడికాల బాలనర్సింహ, సీత శ్రీరాములు, ధనుంజయ్య, బ్యాంకు మేనేజర్ మధు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బాలసుబ్రహ్మణ్యం

పంటకు విరామం

మాసాన్‌పల్లి రైతుల మూకుమ్మడి నిర్ణయం



మాసాన్‌పల్లి రైతులు క్రాప్ హాలిడే ప్రకటించడంతో ఊరచెరువు కింద ఖాళీగా ఉన్న భూములు

- పెరిగిన సాగు ఖర్చులు
- గిట్టుబాటు కాని మద్దతు ధర
- రెండేళ్లుగా నష్టాలు
- పెట్టుబడి డబ్బులైనా మిగులుతాయని క్రాప్ హాలిడేకు కర్షకుల మొగ్గు

ఆరుగాలం శ్రమించి పండించిన పంటకు గిట్టుబాటు ధరే లేనప్పుడు.. తమ కాయ కష్టం దళారుల పాలవుతున్నప్పుడు ఎందుకీ సేద్యం అంటూ దుక్కిదున్నే నాగలి అటకెక్కించాడు.. అన్నదాత. కనీసం పెట్టుబడి డబ్బులు అయినా మిగులుతాయని గుండాల మండలం మాసాన్‌పల్లి రైతులు పంట విరామం ప్రకటిస్తూ మూకుమ్మడి నిర్ణయం తీసుకున్నారు.

గుండాల : మండలంలోని మాసాన్‌పల్లి రైతులు పంట విరామం ప్రకటించారు. గ్రామంలోని ఊరచెరువు కింద సుమారు 120 మంది రైతులకు చెందిన 150 ఎకరాల ఆయకట్టు ఉంది. చెరువులోకి ఏమాత్రం నీళ్లు వచ్చినా.. బోర్లు, బావులున్న రైతులు వరి సాగు చేస్తుంటారు. చెరువు నిండని క్రమంలో జొన్న ఇతర మెట్ట పంటలు వేసేవారు. కానీ, ఈ సంవత్సరం చెరువు నిండా నీళ్లున్నా ఆయకట్టు రైతులంతా సేద్యానికి దూరంగా ఉన్నారు. గత ఏడాది వానాకాలం, యాసంగి సీజన్లలో వరి సాగు చేసిన రైతులు నష్టాలు చవిచూశారు. కూలీ రేట్లు, ట్రాక్టర్లు, వరి కోత యంత్రాల కిరాయిలు భారీగా పెరిగాయని, అందుకు అనుగుణంగా మద్దతు ధర దక్కక నష్టపోవడం వల్లే ఈ నిర్ణయం తీసుకున్నట్లు రైతులు చెబుతున్నారు.

బీడుగా ఆయకట్టు

చెరువు నిండితే రెండు పంటలతో సస్యశ్యామలంగా ఉండే మాసాన్‌పల్లి చెరువు ఆయకట్టు ప్రస్తుతం బీడుగా మారింది. క్రాప్ హాలిడే ప్రకటించిన రైతులు.. తమ భూముల్లో పశువులను మేపుతున్నారు. ఇదిలా ఉండగా పంట విరామం తీసుకున్న రైతులు వ్యవసాయ పనులు లేకపోవడంతో చాలా మంది కూలికి, ఇతర పనులకు వెళ్తున్నారు.



నీళ్లతో కళకళలాడుతున్న ఊరచెరువు

ఖర్చులు ఇలా..

సేద్యానికి పెట్టుబడి ఖర్చులు తడిసిమోపడవుతున్నాయి. యంత్రాల యజమానులు దున్నకానికి ఆఫ్‌వీల్స్ గంటకు రూ.1800 నుంచి రూ.2000, కేజీ ఫుల్ వీల్స్‌కు గంటకు రూ.2500 నుంచి రూ.3000 తీసుకుంటున్నారు. వరి నాట్లు వేసేందుకు కూలీలు ఎకరాకు రూ.6 వేల నుంచి రూ.6500, వరి కోత మిషన్ చైన్ బండికి రూ.3000 నుంచి రూ.3500 చెల్లించవలసి వస్తుంది. వీటితో పాటు ఎరువులు, కలుపు, మధ్యమధ్య తెగుళ్ల నివారణ మందుల పిచికారీ ఖర్చులు పోను మిగులుబాటు కావడం లేదు. ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించినా కొనుగోలు చేసే ధైర్యం చేయడం లేదని, మిల్లర్లు ఇష్టానుసారంగా కోత విధిస్తున్నట్లు రైతులు వాపోతున్నారు. దళారులకు అమ్మితే క్వింటాకు రూ.1400 నుండి రూ.1500 వరకు కొనుగోలు చేస్తున్నారని, సేద్యంతో లాభం లేకపోవడం వల్లే క్రాప్ హాలిడే ప్రకటించినట్లు రైతులు అంటున్నారు.

దిగుబడి వస్తలేదు



చెరువు కింద నాకు ఎకరం పొలం ఉంది. ఆశించిన స్థాయిలో దిగుబడి రావడం లేదు. పెట్టుబడి ఎకరాకు రూ.20వేల నుంచి రూ.22 వేలు వస్తుంది. పంట అమ్మితే రూ.20 వేలు కూడా వస్తలేవు. లాభం లేకపోవడంతో ఈకారు నాటు వేయలేదు. అంతేకాకుండా పొలాల వద్దకు బాటలేకపోవడంతో మిషన్లు వస్తలేవు. నాతో పాటు చెరువు కింద రైతులంతా సేద్యానికి దూరంగా ఉన్నారు.

–లగ్గాని లింగయ్య, రైతు, మాసాన్‌పల్లి

పెట్టుబడి మీద పడుతుంది



ఊరచెరువు కింద 2.10 ఎకరాల భూమి ఉంది. ఏటా వరి సాగు చేస్తుంటాను.రెండేళ్లుగా నష్టాలు ఎదుర్కొంటున్నాను. దున్నకం, నాట్లు, కోత, ఎరువులు, కలుపునకు, తెగుళ్లకు మందుల ఖర్చు తడిసిమోపడువుతుంది. ఆశించిన స్థాయిలో దిగుబడి రాకపోగా మద్దతు ధర కూడా దక్కడం లేదు. పెట్టుబడులు మీద పడుతుండడంతో ఈకారు నాటు వేయలేదు.

– ఎలిపెద్ది మల్లారెడ్డి, రైతు, మాసాన్‌పల్లి

భువనగిరిలో మాతం ప్రదర్శన


భువనగిరిలో మాతం ప్రదర్శనలో రక్తం చిందిస్తున్న షియా ముస్లింలు

భువనగిరి : షియా ముస్లిం సంఘం ఆధ్వర్యంలో శనివారం భువనగిరి పట్టణంలో మొహర్రం 10వ రోజు ఆషురాను పురస్కరించుకుని మాతం ప్రదర్శన నిర్వహించారు. పట్టణంలోని జంఖానగూడెంలోని హజ్రత్ అబ్బాస్ పీర్ల చావడి నుంచి ఖాజీ మోహల్లాలోని బీబీకా ఆలం వరకు మాతం ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా యువత కత్తులతో ఎదను బాదుకుంటూ మహ్మద్ ప్రవక్త మనువడు ఇమాం హుస్సేన్ బలిదానం స్మరిస్తూ రక్తం చిందించారు. కార్యక్రమంలో షియా ముస్లిం సంఘం భువనగిరి అధ్యక్షుడు సయ్యద్ రజా హుస్సేన్, ప్రధాన కార్యదర్శి కల్బె హుస్సేన్, లయిక్ అలీ, మహ్మద్ హుస్సేన్, అన్వర్ అలీ, రసీద్, అస్గర్, సయ్యద్ అద్నాన్ పాల్గొన్నారు.

చౌటుప్పల్‌లో రెండు ఇళ్లలో చోరీ


పరిశీలిస్తున్న ఏసీపీ మొగిలయ్య

చౌటుప్పల్ : గుర్తుతెలియని వ్యక్తులు చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని విశ్వకర్మకాలనీలో శుక్రవారం అర్ధరాత్రి రెండు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. భారీ ఎత్తున బంగారు ఆభరణాలు, నగదు ఎత్తుకెళ్లారు. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చౌటుప్పల్‌లోని విశ్వకర్మకాలనీలో నివాసం ఉండే పెరికేటి నగేష్ తంగడపల్లి రోడ్డులో జ్యూవెలరీ షాప్ నిర్వహిస్తున్నాడు. రాత్రి 11గంటలకు దుకాణం మూసేసి 12గంటలకు ఇంటికి వెళ్లాడు. భోజనం చేసిన తర్వాత 1గంటకు నిద్రపోయాడు. తెల్లవారుజామున 4గంటలకు నిద్రలేచి బాత్రూంకు వెళ్లి వచ్చాడు. అదే సమయంలో ఇంట్లోని సెల్ఫ్‌లో భద్రపరిచిన బంగారు ఆభరణాలు కలిగిన బ్యాగును పరిశీలించాడు. తాను భద్రపరిచిన చోట బ్యాగు లేకపోవడంతో ఆందోళనకు గురయ్యాడు. అన్ని ప్రాంతాల్లో వెతకగా బంగారం భద్రపరిచిన బ్యాగుతో పాటు రూ.45వేల నగదు, 2సెల్‌ఫోన్లు సైతం కన్పించలేదు. అనుమానంతో ఇంట్లో పరిశీలించగా కిటికీ నుంచి మెయిన్ డోర్ తెరిచినట్టుగా గుర్తించాడు. అదే సమయంలో నగేష్ ఇంటి పక్కనే ఉండే దివీస్ పరిశ్రమలో ఉద్యోగం చేసే కట్టా సుబ్రమణ్యం కుటుంబ సభ్యులు సైతం తెల్లవారుజామున నిద్రలేచారు. ఆ సమయంలో ఇంట్లోని పరిసరాలు చిందరవందరగా ఉండడంతో లోతుగా గమనించడంతో ఇంట్లో దొంగతనం జరిగినట్టుగా గుర్తించారు. రూ.40వేల విలువైన బంగారు, వెండి ఆభరణాలు, రూ.3వేల నగదు ఎత్తుకెళ్లారు. ఘటనా స్థలాన్ని ఏసీపీ మొగిలయ్య, సీఐ దేవేందర్ సందర్శించారు. బాధితుల ఫిర్యాదు మేరకు సీఐ దేవేందర్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదవశాత్తు కుంటలో పడి ఒకరి మృతి

అర్వపల్లి: ప్రమాదవశాత్తు నీటికుంటలో పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. ఎస్‌ఐ అంజిరెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జాజిరెడ్డిగూడేనికి చెందిన పగిడిమర్రి రాజు (45) రోజు మాదిరిగానే శనివారం కూలి పని కోసం అర్వపల్లికి వచ్చాడు. బహిర్భూమి కోసం రామన్నగూడెం శివారులోని కుంట వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు అందులో పడిపోయాడు. ఈత రాక నీట మునిగి మృతిచెందాడు. సమీపంలోని రైతులు చూసి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఐ అంజిరెడ్డి ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం తుంగతుర్తి ఆస్పత్రికి తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రాజు గతంలో ప్రజానాట్య మండలి కళాకారుడిగా పనిచేశారు.

ఆర్టీసీలో ప్రగతి రథచక్ర పురస్కారాలు

• ఆర్టీసీ నల్లగొండ రీజియన్ మేనేజర్ శ్రీదేవి


మిర్యాలగూడలో ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లను సన్మానిస్తున్న ఆర్‌ఎం శ్రీదేవి

మిర్యాలగూడ టౌన్: ఆర్టీసీకి అధిక ఆదాయం సమకూర్చుతూ నిబద్ధతతో పనిచేసే సిబ్బందికి ప్రతినెలా ఒక్కో బస్ డిపో నుంచి 24 మందికి ప్రగతి రథచక్ర పురస్కారాలు అందించనున్నట్టు ఆర్టీసీ నల్లగొండ రీజియన్ మేనేజర్ శ్రీదేవి, డిప్యూటీ ఆర్‌ఎం శివశంకర్ తెలిపారు. శనివారం మిర్యాలగూడ బస్ డిపోను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అన్ని విభాగాలను పరిశీలించారు. అనంతరం జూన్ నెలకు సంబంధించి ప్రగతి రథచక్ర పురస్కారాలు పొందిన కండక్టర్లు నాగలక్ష్మి, ఆర్.అచ్చాలి, రామలింగేశ్వరి, స్రవంతి, బీవై.కోటయ్య, రోశయ్య, చంద్రయ్య, పీఎం రావు, డ్రైవర్లు ఎంజే.రెడ్డి, ఆర్‌పీసీ.రెడ్డి, సైదయ్య, జనార్దన్, మోహిజుద్దీన్, మెకానిక్‌లు రవి, శ్రామిక్ తిరుపతయ్య, చాంప్లాను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆర్‌ఎం శ్రీదేవి మాట్లాడుతూ ఆర్టీసీ డిపోల్లో పనిచేసే డ్రైవర్స్, కండక్టర్లు, మెకానికల్‌లు, హెల్పర్లు, ఆర్టిజన్లకు ప్రతినెలా ఈ పురస్కారాలు అందుతాయన్నారు. డిపోకు మంచి ఆదాయం తీసుకొచ్చేందుకు కృషిచేస్తూ, ప్రయాణికుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు లేకుండా విధులు నిర్వహించే వారికి మాత్రమే ఈ పురస్కారాలు అందిస్తామన్నారు. ప్రతి డిపో నుంచి 24మందికి ప్రతినెలతోపాటు ప్రతి మూడు నెలలకు ఒక్కసారి రీజియన్ స్థాయిలో, ఏడాదికోసారి రాష్ట్ర స్థాయిలో ఈ ప్రగతి రథచక్ర పురస్కారాలు, ప్రశంసాపత్రాలు అందిస్తామన్నారు. డిపోలకు మంచి ఆదాయాన్ని తీసుకొచ్చి నల్లగొండ రీజియన్‌ను రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిపేందుకు డ్రైవర్లు, కండక్టర్లు, ఉద్యోగులు, మెకానికల్‌లు, కార్మికులంతా సమన్వయంతో కృషి చేయాలన్నారు. పట్టుదలతో పనిచేస్తే ప్రతి ఒక్కరికీ ఈ పురస్కారాలు అందుతాయన్నారు. అదేవిధంగా ఆర్టీసీ సంస్థ ఎండీ సజ్జనార్ ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన టీ-9, టీ-30 టికెట్లపై కూడా ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం బొల్లెద్దు పాల్, అసిస్టెంట్ డిపో మేనేజర్ సంధ్యారాణి, ఎంఎఫ్ యాదగిరి, ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాల్లో ఆర్టీసీని గుర్తించలేదు

• ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న రాజిరెడ్డి

యాదగిరిగుట్ట : తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీని గుర్తించలేదని ఆ సంస్థ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. యాదగిరిగుట్ట పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో శనివారం తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలు - ఆర్టీసీ, కార్మికుల పరిస్థితి అనే అంశంపై సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో వివిధ పార్టీలతో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆర్టీసీకే రాష్ట్ర ప్రభుత్వం రూ.3,400 కోట్ల అప్పుగా ఉందని పేర్కొన్నారు. ఆర్టీసీని రక్షించుకోవాలంటే అన్ని పార్టీల నాయకులు, ప్రజలు కలిసికట్టుగా ప్రభుత్వంపై పోరాడాలని పిలుపునిచ్చారు. ఆర్టీసీలో గుర్తింపు సంఘాల ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు గోదా శ్రీరాములు, ఎండీ జహంగీర్‌లు మాట్లాడుతూ యాదగిరిగుట్ట బస్సు డిపో, బస్టాండ్‌ను తరలించే ఆలోచనను విరమించుకోవాలన్నారు. లేని పక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సమావేశంలో ఆయా పార్టీల, సంఘాల నాయకులు రాచకొండ జనార్దన్, గోరేటి రాములు, ఎండీ ఇమ్రాన్, కళ్లెం కృష్ణ, కొల్లూరి రాజయ్య, చెక్క వెంకటేష్, కొండమడుగు నరసింహ, బబ్బూరి పోశెట్టి, ఈశ్వర్ రెడ్డి, బందారపు భిక్షపతి, ఆకుల గణేష్, జగదీష్, కురిమిద్ద మల్లయ్య, పేరబోయిన మహేందర్, పేరబోయిన పెంటయ్య, గనబోయిన వెంకటేష్, సామల శోభన్ బాబు, దాసరి లక్ష్మయ్య, పుష్ప, మూనుకుంట్ల నర్సమ్మ పాల్గొన్నారు.

పుట్టపాకకు ప్రపంచ కీర్తి

• చేనేత కళా నైపుణ్యంలో సిద్ధహస్తులు ఈ ఊరి నేతన్నలు
• చేనేతలో తొలి పద్మశ్రీ అవార్డు పుట్టపాక సొంతం
• ఫ్రాన్స్ ప్రథమ మహిళకు ప్రధాని మోదీ బహూకరించిన దుబీయన్ చీర ఇక్కడిదే..
• ఖండాంతరాలకు పుట్టపాక చేనేతల ఖ్యాతి

సండే స్పెషల్

అదో చిన్న గ్రామం.. 4,550 మంది జనాభా.. వారిలో సుమారు మూడు వేల మందికి చేనేతే ఆధారం. 657 మగ్గాలతో ప్రతి ధారం పోగును కలిపి వస్త్రం నేస్తూ వినూత్న ఆలోచనలకు రూపమిస్తున్నారు యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం పుట్టపాక చేనేత కార్మికులు. తమ చేనేత కళా నైపుణ్యంతో ఆ ఊరి కీర్తిని ఇప్పుడు ప్రపంచానికి చాటారు. దుబీయన్, తేలియా రుమాల్ వస్త్రం నేయడం వీరి ప్రత్యేకత. ఇటీవల ప్రధాని నరేంద్రమోదీ ఫ్రాన్స్ పర్యటనలో భాగంగా ఆ దేశ అధ్యక్షుడి భార్య బ్రిగిట్టే మెక్రాన్‌కు దుబీయన్ చీరను బహూకరించడంతో పుట్టపాక ఖ్యాతి ఖండాంతరాలకు చేరింది.

– నల్లగొండ డెస్క్


ఫ్రాన్స్ అధ్యక్షుడి భార్యకు బహుమానం అందజేస్తున్న ప్రధాని మోదీ (ఫైల్)


ఫ్రాన్స్ అధ్యక్షుడి భార్యకు భారత ప్రధాని నరేంద్రమోదీ అందజేసిన దుబీయన్ చీర (ఫైల్)



దుబీయన్ చీర

గుర్తింపుతో నూతన ఉత్సాహం..



పుట్టపాక చేనేత కళాకారులు నిరంతరం తమ ప్రతిభను చాటుతున్నారు. తేలియా రుమాల్ అనే వస్త్రంతో నూతన డిజైన్లు ఆవిష్కరిస్తున్నారు. ఇక్కడి వస్త్రాలకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు ఉంది. ప్రముఖులకు ఇక్కడి వస్త్రాలను బహూకరిస్తుంటారు. గుర్తింపు లభించినప్పుడు నూతన ఉత్సాహంతో మరింత ఎక్కువగా పనిచేస్తున్నారు. కార్మికులకు నా వంతు సహకారం అందిస్తున్నా.

– గజం గోవర్ధన్, పద్మశ్రీ అవార్డు తొలి గ్రహీత

ప్రభుత్వం ప్రోత్సహించాలి



చేనేత కళాకారులను ప్రభుత్వం ప్రోత్సహించాలి. మేము సృజనాత్మకంగా అనేక డిజైన్లతో వస్త్రాలు తయారు చేస్తుండడంతో అవార్డులు, గుర్తింపు వస్తున్నాయి. వస్త్రాలు అమ్మడానికి పట్టణాల్లో స్టాల్స్ ఏర్పాటుకు ప్రోత్సాహం అందించాలి. ఎగ్జిబిషన్లు నిర్వహించినప్పుడు ఆర్థికంగా ప్రోత్సాహం లభిస్తుంది.

– గూడ శ్రీను, చేనేత కళాకారుడు, జాతీయ అవార్డు గ్రహీత

చేనేత వస్త్రాల తయారీ ప్రయోగశాల పుట్టపాక. ఇక్కడి చేనేత కార్మికులు కళా నైపుణ్యానికి పదును పెడుతూ, సృజనాత్మకతను వెలికి తీస్తూ, పోటీతత్వంతో అనేక కొత్త డిజైన్లను రూపొందిస్తుంటారు. నూతన ఒరవడి సృష్టించడం వీరికి వెన్నతో పెట్టిన విద్య. తేలియా రుమాల్, దుబీయన్ వస్త్రం తయారీ, నిలువు ధారంపై డిజైన్‌లు చేసి రంగులు అద్దడం ఇక్కడి కళాకారుల ప్రతిభకు నిదర్శనం. ప్రజల అభిరుచికి తగినట్లుగా వస్త్రాలు రూపొందించడంలో వీరు దిట్ట. చేనేత కళా రంగానికి తొలి పద్మశ్రీ అవార్డు వచ్చింది పుట్టపాక గ్రామ చేనేత కళాకారులకే. వీరి కళా నైపుణ్యానికి రెండు పద్మశ్రీ అవార్డులు వరించాయి. మరెన్నో జాతీయ అవార్డులు ఈ గ్రామ చేనేత కార్మికుల సొంతం. డబుల్ ఇక్కత్ తేలియా రుమాల్ వస్త్రంతో పుట్టపాకకు ప్రపంచ గుర్తింపు వచ్చింది.

ప్రాచీన కళ తేలియా రుమాలు వస్త్రం..

పుట్టపాకకు చెందిన గజం నర్సింహ ప్రాచీన తేలియా రుమాలు వస్త్రాన్ని వెలుగులోకి తెచ్చారు. దీని తయారీ కోసం నూలును 21 రోజుల పాటు ప్రాసెస్ చేస్తారు. ఆ తర్వాత వస్త్రం అవసరాన్ని బట్టి వార్పుపై అవసరమైనంత పొడవులో దారాలను తీస్తారు. మగ్గంపై కావాల్సిన తీరులో డిజైన్లతో కూడిన వస్త్రాన్ని రూపొందిస్తారు. ఇలా తేలియా రుమాలు వస్త్రంతో తలపాగాలు, చీరలు, దుప్పట్లాలతో పాటు ఇతర దుస్తులను తయారు చేస్తున్నారు. ఇవి ఎండాకాలం చల్లగా, చలికాలం వెచ్చగా ఉండడమే కాక సుగంధ వాసనలు వెదజల్లుతాయి. ఇలా తయారు చేసే చీరలు డిజైన్లను బట్టి రూ.30 వేల నుంచి రూ.2 లక్షల ధర పలుకుతున్నాయి. ఒక చీర నేయడానికి మూడు నెలల సమయం పడుతుంది. ఇక్కడి తేలియా రుమాల్ వస్త్రాలు ముంబయి, సోలాపూర్, కోల్‌కతా, చెన్నై, గుజరాత్, బెంగళూరులతో పాటు సింగపూర్, అమెరికా, జర్మనీ, జపాన్, నెదర్లాండ్, అరబ్ దేశాలకు ఎగుమతి అవుతుంటాయి.


2013 సంవత్సరంలో పద్మశ్రీ అవార్డు అందుకుంటున్న గజం అంజయ్య


రాట్నంపై దారం చుడుతున్న చేనేత కార్మికురాలు

పుట్టపాక ప్రత్యేకం.. దుబీయన్ వస్త్రం

దుబీయన్ వస్త్రం డిజైన్ దేశంలో ఎక్కడా కనిపించదు. కేవలం పుట్టపాకలోని చేనేత కళాకారులు మాత్రమే దుబీయన్ వస్త్రం నేస్తారు. ఈ వస్త్రం తయారీలో నిలువు ఇక్కత్ (వార్పుపై పొడుగు దారం) విధానం పాటిస్తారు. అదే విధంగా డిజైన్ కూడా నిలువు ఇక్కత్‌లోనే రూపొందిస్తారు. ఈ వస్త్రం తయారీకి వాడే దారాలు కూడా పలుచగా ఉంటాయి. దుబీయన్ వస్త్రంతో చీరలు, ఫ్యాబ్రిక్ దుస్తులు తయారు చేస్తారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఫ్రాన్స్ పర్యటనలో భాగంగా ఆ దేశ ప్రథమ మహిళ బ్రిగిట్టే మెక్రాన్‌కు పుట్టపాకలో చేనేత కళాకారులు తయారు చేసిన దుబీయన్ సిల్క్ చీరను చందనం పెట్టెలో పెట్టి బహూకరించారు.

కట్టుకున్నోడే కాలయముడు!

• భార్య లహరిని అతి కిరాతంగా కొట్టి చంపిన భర్త వల్లభ్‌రెడ్డి
• ప్రాథమిక పోస్టుమార్టం నివేదికలో వైద్యుల వెల్లడి
• పొత్తికడుపులో తన్ని, తల, వీపుపై బలంగా కొట్టడమే మృతికి కారణం
• వల్లభ్‌రెడ్డిని అరెస్టు చేయొద్దని ప్రజాప్రతినిధుల నుంచి పోలీసులకు ఒత్తిళ్లు
• ఇన్సూరెన్స్ కూడా ఓ కారణం కావొచ్చని పోలీసుల అనుమానం

హిమాయత్‌నగర్ (హైదరాబాద్): ఇటీవల మరణించిన లహరిరెడ్డి గుండెపోటుతో చనిపోలేదని, ఆమెను అత్యంత కిరాతకంగా కొట్టడం, గాయపరచడం కారణంగానే మృతిచెందిందని వైద్యులు ఇచ్చిన పోస్టుమార్టం రిపోర్టులో వెల్లడైంది. ఈ కేసులో మొదటనుంచీ అనుమానాస్పదంగా ఉన్న నల్లగొండకు చెందిన కాంగ్రెస్ నేత కుమారుడు, భర్త వల్లభ్‌రెడ్డిని హైదరాబాద్ నారాయణగూడ పోలీసులు ఈనెల 26న అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. ఓ పక్క వైద్యులు ఇచ్చిన పోస్టుమార్టం రిపోర్టులో అనేక కీలకమైన విషయాలు బహిర్గతం కాగా, మరో పక్క తమకు ఎవరిపై అనుమానాలు లేవని మృతురాలి తండ్రి బహిరంగంగా వెల్లడించడం పలు చర్చలకు దారితీస్తోంది. తాము పోస్టుమార్టం రిపోర్టు ఆధారంగా కేసు నమోదు చేసి వల్లభ్‌రెడ్డిని అరెస్టు చేసినట్లు నారాయణగూడ ఎస్‌హెచ్‌ఓ శ్రీనివాస్ వెల్లడించారు.

పొత్తికడుపులో తన్నడం వల్లే..

గత ఏడాది వల్లభ్‌రెడ్డి–లహరిలకు వివాహమైంది. అప్పటి నుంచీ వీరిద్దరి మధ్య సంతానం విషయంలో గొడవలు జరుగుతున్నాయి. ఈనెల 14న ఉదయం కూడా వారిద్దరి మధ్య చిన్నపాటి వాగ్వాదం జరిగింది. అప్పటికే లహరిపై ఆగ్రహంతో ఉన్న వల్లభ్‌రెడ్డి ఆమెను దారుణంగా కొట్టాడు. అపస్మారక స్థితికి చేరుకున్న ఆమెను హైదర్‌గూడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించగా..అప్పటికే ఆమె చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఇటీవల వైద్యులు ఇచ్చిన ప్రాథమిక పోస్టుమార్టం రిపోర్టులో ఆమెపై దారుణంగా దాడి జరిగిందని స్పష్టంగా వెల్లడైంది. దీంతో మూడు రోజుల క్రితం వల్లభ్‌రెడ్డిని పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపారు.

అరెస్టు చేయొద్దంటూ ఒత్తిళ్లు

వైద్యులు ఇచ్చిన పోస్టుమార్టం నివేదిక ఆధారంగా పోలీసులు నల్లగొండ జిల్లాలో వల్లభ్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని హైదరాబాద్ అఫ్జల్‌గంజ్ పోలీసుస్టేషన్‌కు తరలించారు. దీంతో నల్లగొండ జిల్లాకు చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు, బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన ఒక ఎమ్మెల్సీ, కాంగ్రెస్ పెద్దలు, మాజీ ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్‌లు, కార్పొరేటర్‌లు అతన్ని అరెస్టు చేయొద్దంటూ పోలీసులపై ఒత్తిడి తెచ్చారు. ఈనెల 26న ఉదయం 8గంటలకే ఒక ఎమ్మెల్యే నారాయణగూడ పోలీసు స్టేషన్‌కు వచ్చి వల్లభ్‌రెడ్డిని అరెస్టు చేయొద్దంటూ హుకుం జారీ చేయడం గమనార్హం. మరో పక్క ఈ హత్యకు లహరి పేరుపై ఉన్న కోట్లాది రూపాయిల ఇన్సూరెన్స్ కూడా ఒక కారణం కావొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

ఫిట్స్ రావడం వల్లే దెబ్బలు తగిలాయి

మా కుమార్తెకు ఆ రోజు ఫిట్స్ వచ్చి కిందపడింది. అందువల్లే ఆమెకు దెబ్బలు తగిలాయి. మాకు ఎవరిపైనా ఏవిధమైన అనుమానాలు లేవు. పోలీసులు, వైద్యులు ఏవేవో ఊహించుకుంటూ బయటపెట్టడం, దానిని మీడియా వక్రీకరించడం సరైంది కాదు. పోలీసుల తీరుపై ఇప్పటికే హైదరాబాద్ సీపీకి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశాను. మా వల్లే వల్లభ్‌రెడ్డి కుటుంబానికి చెడ్డపేరు వస్తోంది.

– జైపాల్‌రెడ్డి, లహరి తండ్రి

మాపై రాజకీయ కుట్ర

మాపై కొందరు రాజకీయ కుట్రకు తెరలేపారు. మా కోడలు లహరి మాతో చాలా మంచిగా ఉండేది. ఆమె కిందపడటం వల్లే గాయాలయ్యాయి. పోస్టుమార్టం రిపోర్టులో ఏముందో మాకు తెలియదు, కోర్టులో మాకు న్యాయం జరుగుతుంది.

– యడవల్లి రంగసాయిరెడ్డి, వల్లభ్‌రెడ్డి తండ్రి

ఎన్‌టీసీఏ అవార్డు అందుకున్న ఫారెస్ట్ బీట్ ఆఫీసర్

చందంపేట : అటవీ శాఖలో ఉత్తమ సేవలు అందించినందుకు గాను నల్లగొండ జిల్లా చందంపేట మండలం కంబాలపల్లి బీట్ ఆఫీసర్ ఎ.కవిత శనివారం ఉత్తరాఖండ్‌లో కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. అటవీ శాఖలో ఉత్తమ సేవలకు గాను కేంద్ర ప్రభుత్వం నేషనల్ టైగర్ కన్సర్వేషన్ అథారిటీ(ఎన్‌టీసీఏ) ఆధ్వర్యంలో అందించే అవార్డును అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలో మొట్టమొదటి సారిగా కంబాలపల్లి బీట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న ఎ.కవిత అందుకోవడం విశేషం. గ్లోబల్ టైగర్ డేను పురస్కరించుకొని శనివారం ఈ అవార్డును కవితకు ప్రదానం చేశారు.


కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి భూపేంద్రయాదవ్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న కవిత

అధిక వర్షాలకు పంటలను కాపాడుకోండి ఇలా..

• కేవీకే సస్యరక్షణ శాస్త్రవేత్త ఆదర్శ్ సూచనలు


ఆదర్శ్, శాస్త్రవేత్త

గరిడేపల్లి : ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పంట పొలాలు దెబ్బతిన్నాయి. వర్షాలు తగ్గిన వెంటనే రైతులు పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను కేవీకే సస్యరక్షణ శాస్త్రవేత్త ఆదర్శ్ వివరించారు. వివరాలు ఆయన మాటల్లోనే..

పత్తిలో తెగుళ్ల నివారణకు..

» అధిక వర్షాలకు పత్తి మొక్కలు పసుపు, ఎరుపు రంగుల్లోకి మారే అవకాశం ఉంది. దీని నివారించాడానికి మొక్క వయసును బట్టి 10గ్రాముల పొటాషియం నైట్రేట్(13:00:45) లేదా (19.19.19) పది గ్రాముల లీటర్ల నీటిలో కలిపి పొలం అంతా పిచికారీ చేయాలి.

» పత్తి పంట ఎదుగుదలకు వర్షాలు తగ్గిన వెంటనే రైతులు 25కిలోల యూరియా, 10కిలోల పొటాష్ ఎరువులను మొక్కకు ఐదు సెంటిమీటర్ల దూరంలో వేసుకోవాలి.

» అధిక తేమ ఉండటం వలన పత్తిలో రసం పీల్చే పురుగులు పచ్చ దోమ, తెల్ల దోమ, తామర పురుగులు, పేను బంక ఆశించడం గమనించవచ్చు. రైతులు, వాటి లక్షణాలు గమనించినచో నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ లీటర్లు లేదా అసిటామిప్రిడ్ 0.2 గ్రాములు లేదా అసిఫేట్ 1.5 మి.లీ లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

» నేలల్లో అధిక తేమ ఉండటం వలన పత్తి మొక్కలకు వేరుకుళ్లు, కాండం కుళ్లు వంటి తెగుళ్లు ఆశించే అవకాశం ఎక్కువగా ఉంటుంది. దీని నివారణకు మొదటగా 5 మి.లీ ట్రైకోడర్మ విరిడి లేదా 3గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా ఒక గ్రాము కార్బండజిమ్ లేదా రిడోమిల్ గోల్డ్ 3 గ్రాములు లీటర్ నీటికి కలిపి ఆ ద్రవాన్ని తెగులు ఆశించిన మొక్కల పాదుల చుట్టూ నేలపై వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పోసుకోవాలి. తద్వారా కుళ్లురోగాలను త్వరగా నివారించుకోవచ్చు.


పెన్‌పహాడ్‌లో పత్తి రైతులకు నీటి నిల్వలపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త లవకుమార్ (ఫైల్)


పెన్‌పహాడ్ మండలంలో పత్తి చేనులో నిలిచిన నీరు

పాడి పంట

వరి చేలల్లో..

» వరి నారు మడిలో మురుగునీరు కాలువల ద్వారా తీసివేసిన తర్వాత నారు మడిని పూర్తిగా ఆరనివ్వాలి.

» వర్షాలు తగ్గిన తరువాత నారు ఎర్రబడితే నివారణకు ఎకరాకు 19:19:19, 10 గ్రాముల లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

» వర్షపునీటిని సరైన సమయంలో తిసివేయకుంటే నారు కుళ్లిపోయి చనిపోవడానికి ఆస్కారం ఉంటుంది. రైతులు వర్షపు నీటిని తీసివేసి కుళ్లిన లక్షణాలు ఉంటే 5 మి.లీ ట్రైకోడర్మ విరిడి లేదా 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు మొక్క పాదల్లో పోసుకోవాలి.

» ప్రస్తుత వాతావరణంలో వరిలో అగ్గి తెగులు ఆశించే అవకాశం ఉంది. దీని నివారణకు మాన్కోజెబ్+కార్బండజిమ్ 2గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకొని పంటలను కాపాడుకోవాలి.

» ఆకులను తినే శనగ పచ్చ పురుగు గమనిస్తే నోవల్యూరాన్ 1 మి.లీ, లేదా స్పైనోసాడ్ 0.3 మి.లీ లేదా ఫ్లుబెండమైడ్ 0.2 గ్రాములు లీటర్ల నీటిని కలిపి పిచికారీ చేసుకోవాలి.